

# దెబ్బ

కె.వి.యస్.యస్. సీతారామారావు

సుబ్బారావు యింట్లోకి అడుగు పెడుతూనే విస్తుపోయాడు. రోజూ తను ఆఫీసునుంచి యింటికివచ్చే వేళకు, తెల్లచీరతో, మల్లెపూలతో, చల్లని చిరునవ్వుతో గుమ్మందగ్గరికి ఎదురొచ్చే తనభార్య రాజ్యలక్ష్మి ఈ రోజు రాలేదు. ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది రోజూ భార్యతోపాటు ఎదురువచ్చే పిల్లలి చడీచప్పుడూకూడాలేదే అనుకుంటూ లోపలికి వెళ్ళాడు సుబ్బారావు. బెడ్ రూమ్‌లో కనిపించిన దృశ్యం సుబ్బారావుకు మరింత ఆశ్చర్యాన్ని కలుగజేసింది రోజూ యీపాటికి నానారభసచేసే పాప కిమ్మనకుండా మంచంమీద బోర్లా పడుకునిఉంది. రాజ్యలక్ష్మి బాబును పడుకోబెట్టి, ఒలవంలాన నిద్ర పుచ్చాలని కాబోలు విసురుగా బాదుతూ జోకొడుతున్నది,

ఇంకా నిద్రపట్టనట్లుంది. పాప తండ్రిని చూడగానే లేచికూర్చుంది.

"ఊఁ పడుకో" గదమాయించింది రాజ్యలక్ష్మి.

"ఏమిటి వ్యవహారం హాట్ హాట్ గా ఉంది. నామీద కోపం అంతా పిల్లసన్నాసులమీద చూపిస్తావేం." నవ్వుతూ మంచంమీద భార్యదగ్గరగా కూర్చోబోయాడు.

ఊహించలేనంత విసురుగా లేచి వంటింట్లోకి వెళ్ళింది రాజ్యలక్ష్మి.

తల్లి దగ్గరలేదన్న ధైర్యం కాబోలు. పాప చిన్నగా తండ్రిదగ్గరకువచ్చింది.

"నాన్నగారూ! మరేమో అమ్మ నన్ను కొట్టింది." అంది గోముగా బుంగమూతి పెట్టి.

రాజ్యలక్ష్మి ప్రస్తుత విధానానికీ పాపని కొట్టడానికీ ఏమైనా సంబంధం ఉందేమో అనిపించిందిగానీ అలా ఎందుకుఉంటాలో సరిగా అర్థంకాలేదు సుబ్బారావుకు.

"అలాగా! మరి నువ్వేమైనా అల్లరి చేశావేమో" లాలనగా అన్నాడు.

వెంటనే అందుకుంది పాప "లేదు నాన్నారూ! నేనేం అల్లరి చెయ్యలేదు. మరేమో పక్కింటి సుజాత అత్తయ్యగారు మనింటికివచ్చింది. అమ్మ అత్తయ్యగారు చాలాసేపు మాట్లాడుకున్నారు. అత్తయ్యగారు వెళ్ళిన దగ్గర్నుంచి నన్ను ఊరికే కేకలేస్తున్నది కొట్టిందికూడా." నాలుగేళ్ళ వయసులో తను అర్థంచేసుకోగలిగినదంతా చెప్పింది పాప.

గతుక్కుమన్నాడు సుబ్బారావు. అయితే ఆ సుజాతే దీనికి కారణం అయి ఉంటాలి, తనే ఏదో చెప్పిఉంటుంది. అందుకే ఈ రాద్ధాంతం అంతా. కొంప తీసి నిన్న తనుచేసిన పొరపాటుగాని బయటపడలేదుగదా! అయినా ఆ విషయం సుజాతకుమటుకు ఎట్లా తెలుస్తుందబ్బా! ఆలోచనలు తెగకుండా పరంపరలుగా వస్తున్నాయి.

సరేకానీ! ఏమిటో తెలియకపోదుకదా! అనుకుంటూ "పాపా! నువ్వు పడుకోమ్మా! నేను భోజనంచేసివస్తాను" అని దొడ్లోకి బయలుదేరాడు. బాబు అప్పటికే నిద్రపోయాడు. స్నానం ఆదీచేసి బట్టలు మార్చుకొని వచ్చేసరికి సుబ్బారావు ఒక్కడికి కంచంలో భోజనంపెట్టి కొంచెం దూరంగా కూర్చొని ఉంది రాజ్యలక్ష్మి.

"ఏమిటిది?" సుబ్బారావు స్వరం కొంచెం తీవ్రంగా వినిపించింది. "ఇవ్వాళనుంచి క్రొత్త అలవాట్లు నేర్చుకుందామనుకుంటున్నావా? నువ్వుకూడా పెట్టుకో" అధికారం ధ్వనించింది.

"నాకు ఆకలిలేదు క్రొత్త అలవాట్లు నేర్చుకుందామనుకునేది నేనుకాదు." నేను కాదు అన్నమాట ఒత్తిపలుకుతూ ఉక్రోషంతో వచ్చింది సమాధానం.

తగ్గిపోయాడు సుబ్బారావు ఆ జవాబులో దాగివున్న భావం అర్థమయింది. తెలిసిపోయింది నిన్న తను చేసిన పొరపాటు ఎలాగో తెలిసిపోయింది రాజీకి అను



కున్నాడు. భగవాన్! నిన్న తనను ఏం పూనింది? తనెందుకు అంత బలహీనత ఆవరించింది?———

సినిమారీలులాగా 'నిన్న' కళ్ళముందు కదలసాగింది. అందులో మొదటిబొమ్మగా చాలాకాలం తర్వాత నిన్ననే కలసిన తన చిన్ననాటి స్నేహితుడు రాంబాబు కనిపించాడు. ఒళ్ళు వంచకపోయినా ఉండే సుబ్బారావుకు అవును నాకే వాడంటే ఈ ఒక్కటే ఎంతో. ఎన్నో ఏళ్ళనుంచి కలుసుకోవాలని, నిన్న మటుకు ఎందుకు కలవాలి? తన కొంప ముంచటానికి కాకపోతే! కలిశాడే అనుకుందాం! వాడి ఇల్లరికం సంగతి, పెళ్ళాం తరుపునుంచి వాడికి వచ్చిన ఆస్తి సంగతి పనీపాటాలేకుండా తిరిగేవాడి సంగతి చెప్పి వదిలిపెట్టవచ్చుగదా! అంతటితో వదలక, నాకు యింత గొప్ప అలవాట్లున్నాయి సుమా, చూపించటానికి కాబోలు.

'బార్'కు తీసుకువెళ్లాడు. తనసలు ససేమిరా రాననేఅన్నాడు. అయినా వాడు వింటేనా! రెక్కపట్టుకొనిలోపలకి లాక్కెళ్లాడు. తనకుకూడా కలిపి రెండు బాటిల్స్ బీరు ఆర్డరిచ్చాడు. తనమర్యాద అంతా చూపటానికి మరొకఅవకాశం దొరకదనుకున్నాడోఏమో! ఒకటేగోల! కనీసం అర గ్లాసైనా పట్టాల్సిందేనని. తను ఎంతకూ వినలేదు. చివరి బాణం వదిలాడు రాంబాబు.

"ఏరా మీ ఆవిడకు తెలుస్తుందని భయపడుతున్నావా! ఏమిటి? ఏంపర్వా

లేదు. తెలియదులేకానీ" నవ్వుతూ అన్నాడు.

అభిమానం బుస్సుమని పైకివచ్చింది తనకు నవ్వుతూనే సమాధానం యిచ్చాడు.

"అరేయ్ నేను యిల్లరికపు అల్లుణ్ని కాదురా! భార్యకు భయపడి బార్‌లో త్రాగడానికి. మరీ మాట్లాడావంటే ఈ రెండు సీసాలూ యింటికి పట్టుకెళ్ళి త్రాగుతాను చూడు. యింట్లో మనకు తిరుగులేదురా! ఎంత అంటే అంత." ఆవేశంలో గ్లాసెడు గటగటా త్రాగేశాడు.

అంతే! జీవితంలో మొదటిసారిగా తనెప్పుడూ చేయనిపని, చేయకూడదు, చేయలేడు అనుకున్నంత పనిచేశాడు. ఏదో మహా అపరాధం చేసినట్లుగా ఫీల్ అయ్యాడు. నిన్న యింట్లోకూడా రాజీతో ఫ్రీగా మాట్లాడలేక పొయ్యాడు. ఎక్కువ మాట్లాడితే వాసన వస్తుందేమోనని, తలనొప్పిగా ఉందని నోరు మెదపకుండా పడుకునిఉంటే, పాపం నిజంగానే తలనొప్పి అనుకున్నట్లుంది.

తనను గురించి చాలా గొప్ప అభిప్రాయాలున్నై రాజీకి పాపం! "నా అదృష్టంకొద్దీ మావారికి దురలవాట్లు ఏమీలేవండీ! సిగరెట్లుకూడా కాల్చరు." అని యిరుగమ్మపొరుగమ్మలలో చెప్తుంటే చాలా సార్లు విన్నాడతను.

"రాజీ! ఈ రోజుల్లో సిగరెట్లు కాల్చనివాడు ఒట్టి వెధవక్రింద లెఖ్ఖ. అటువంటిది, నువ్వు దాన్నొక క్వాలిఫికేషను క్రింద చెప్పుకుంటే విన్నొక పాత చింతకాయ క్రింద జమకడ్తారు." అని ఎన్నోసార్లు చెప్పాడతను.

"అయినా సరే! అదే నాకు గొప్ప! సిగరెట్లు త్రాగని భర్తదగ్గర ఉండే సుఖం వాళ్ళకెలా తెలుస్తుంది." ముసిముసి నవ్వులు నవ్వుతుంది తను.

అటువంటి రాజీని ఏదో మోసం చేశానన్న బాధ మనసులో పీకుతోంది. ఏమైనా సరే! ఈ జీవితంలో అదే మొదటిసారి, అదే చివరిసారి కావాలని గట్టిగా నిర్ణయించుకున్నాడు. పరమానవుడికికూడా ఈ విషయం చెప్పకూడదనుకున్నాడు.

మరి....మరి. ఈ విషయం రాజీకెట్లా తెలిసిందో!

"ఎందుకంత ఆలోచిస్తారు? నేను ఏమన్నానని?" ఎత్తిపొడుపు స్పష్టంగా వినిపించింది.

కిమ్మనలేదు సుబ్బారావు. భోజనం చెయ్య బుద్ధికాలేదు. కంచంలో చెయ్యి కడుక్కొని లేస్తూ ఒక్కసారి రాజ్యలక్ష్మి ముఖంలోకి చూశాడు. ఆ చూపులో నిజంగా నేను తప్పు చేశాను అన్న బాధ వుంది! నే చేసిన తప్పుకోసం నీ వింత బాధ పడ్తున్నావే అన్న విచారం వుంది. నీ అంతటి ప్రేమ మూర్తి నాలాంటి బలహీనుడికి భార్య అయిందే అన్న జాలి వుంది. వీటన్నిటిని మించి, నీ ఆవేదన వెనకాల ఉన్నదంతా నా మీద ప్రేమే



జ్యోతి

కదా! అన్న ఆనందాతిశయం వుంది.

ఆ చూపులు భరించలేకపోయింది రాజ్యలక్ష్మి. మెల్లగా తనుకూడా లేచి వెళ్ళింది. సుబ్బారావు వెల్లకిలా మంచం మీద పడుకొని ఆలోచిస్తున్నాడు. రాజ్యలక్ష్మి ముఖం యిప్పుడు పూర్తిగా మారిపోయి వుంది. ఇందాకటి ఆవేశం లేదు, రోషం లేదు. "నిజానిజాలు తెలుసుకోకుండా అనవసరంగా బాధపెడ్తున్నట్లున్నాను" అని ఆత్మ వివర్శన చేసుకుంటున్నట్లుగా వుంది.

"కూర్చో" అన్నట్లుగా ప్రక్కన చెయ్యి చూపించాడు సుబ్బారావు. నెమ్మదిగా మంచంమీద కూర్చుంది రాజ్యలక్ష్మి.

"ఏమిటి రాజీ? విషయం చెప్పు;" ప్రేమగా భుజంమీద చేయివేస్తూ నిశ్చలంగా అడిగాడు సుబ్బారావు.

పూర్తిగా కరిగిపోయింది రాజ్యలక్ష్మి. ఛీ! ఏమిటి యింతటి ప్రేమమూర్తినా తను బాధ పెడుతున్నది! కరస్పర్శతోనే అపూర్వమైన ప్రేమానుభూతిని అందిస్తున్న తన దైవంతోనా తను యిలా ప్రవర్తిస్తున్నది. కరిగిపోయిన హృదయమంతా కళ్ళల్లోంచి ధారలుగా ప్రవహిస్తున్నది. ఆపడం సాధ్యం కావడం లేదు.

"రాజీ! ఏమిటిది? విషయం చెప్పకుండా అంత యిదైపోతావేం?" యింకా దగ్గరకు తీసుకుంటూ అనునయంగా అన్నాడు సుబ్బారావు.

ఏడుపును దిగమింగుతూ జవాబు చెప్పింది రాజ్యలక్ష్మి. "మీరు నిన్న సాయంకాలం ఎవరితోనో కలసి బార్ లోంచి బయటకు వస్తూంటే చూశానని ప్రక్కింటి సుజాత చెప్పింది! నా గుండెలు పగిలిపోతున్నాయి. ఒక్కమారు నా వంక చూసి, నామీద ఒట్టేసి చెప్పండి అదంతా శుద్ధ అబద్ధమని" భర్త ఒట్టు వేస్తాడన్న నమ్మకం బాగా కన్పడుతోంది మాటల్లో.

ఒక్క క్షణం ఆలోచించాడు సుబ్బారావు. రాజ్యలక్ష్మి ముఖంవంకే ప్రశాంతంగా చూస్తూ అన్నాడు. "నిజం రాజీ! నీ మీద ఒట్టు. అంతా వట్టి అబద్ధం. ఆ సుజాత ఎవరిని చూసి నన్ననుకున్నదో."

అమ్మయ్య, అని తేలికగా గాలిపీలుస్తూ భర్త వళ్ళో వాలిపోయింది రాజ్యలక్ష్మి.

ఒక మాట మనసులో మాటలు వినే శక్తి యింకో మనసుకే ఉంటే రాజ్యలక్ష్మి మనసుకు ఈ విధంగా వినిపించేది.

"ఎవరో చెప్పినదానికే యింతగా తల్లడిల్లిపోతున్న నీ సున్నితమయిన హృదయం. నా అంతట నేను ఒప్పుకొన్నా చేదు నిజం భరించగలదా ఈ తీయని మూర్తి. నా జీవితం యొక్క అర్థమే నీవు. నా ప్రాణానికే ప్రాణానివి నీవు. నీ మీద ఒట్టు నిన్ను ఎప్పుడో ఏదో చేస్తుందన్న అర్థంలేని భయంతో, ఇప్పటికిప్పుడే నీవు నా భావనమీద కట్టుకున్న సుందరహర్మ్యాలన్నీ, ఒక్కమాటుగా నా చేతులారా నేనే కూలద్రోసుకునేటంత మూర్ఖుణ్ణి కాను నేను. నాకు నీవు కావాలి. నీ ప్రేమ కావాలి. అందుకే నీకన్నా, నీ మీద ఒట్టుకు నేను యెక్కువ విలువ యివ్వను. నీకు అణుమాత్రమయినా కష్టం కలిగించే ఆ ఒట్టును నేను లెక్కచేయను. ఇది స్వార్థం కావచ్చు. కాని మోసం మాత్రం కాదు."

❋